క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా సీతారామపురం సబ్ స్టేషన్, మారుతీనగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీ నగర్ కాలువగట్టు, చుట్టుగుంట కాలువగట్టు, సిమెంట్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్ల వారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధి, మసీదు వీధి, గద్దే పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేని వారి వీధి, మిల్క్ బూత్ స్ట్రీట్,పటేల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రకాష్‌నగర్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రకాష్‌నగర్లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్, డివిజన్ కోఆర్డినేటర్ కె. వీర బాబు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొంటారు. ప్రజలు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు వినియోగించుకోవాలి.

బాబాకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం చేశారు. మధ్యాహ్నం దాత దాసరి చిట్టిబాబు, కళ్యాణి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

గాయపడిన వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టెం రామారావు (75) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నున్న గ్రామానికి చెందిన పట్టెం రామారావు కూరగాయల కోసం పాయకాపురం రైతుబజారుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. రోడ్డు పై పడిన రామారావు తలకు బలమైన గాయం తగిలింది. బాధితుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వాంటమ్ డాట్స్‌పై మరిన్ని ఆవిష్కరణలు రావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రసాయన శాస్త్రంలోని క్వాంటమ్ డాట్స్‌పై మరిన్ని ఆవిష్కరణలు రావాలని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యుడు డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఇటీవల నోబెల్ బహుమతి పొందిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణ, అభివృద్ధి అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి మాట్లాడుతూ నానో టెక్నాలజీ తరువాత క్వాంటమ్ డాట్స్‌కు సంబంధించిన ఆవిష్కరణ ఇటీవల ముందుకు వచ్చిందన్నారు. దీంతో భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, మినీ సెన్సర్లు, క్వాంటమ్ కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణకు దోహదపడుతుందన్నారు. క్వాంటమ్ డాట్స్ చాలా ప్రత్యేకమైన లక్షణాలను కలిగి ఉండటమే కాకుండా వివిధ రంగాల అభ్యున్నతికి అండగా ఉండొచ్చన్నారు. ఈ రంగంలో చాలా విస్తృతమైన పరిశోధనలకు అవకాశముందన్నారు. అదే విశ్వవిద్యాలయానికి చెందిన మరో ఆచార్యుడు డాక్టర్ సతీష్ మాట్లాడుతూ క్వాంటమ్ డాట్స్‌తో వ్యాక్సిన్ల సంశ్లేషణకు సంబంధించి చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మానవాళి వైద్యానికి సంబంధించిన అంశాల్లో క్వాంటమ్ డాట్స్ వినియోగంతో చాలా మేలు జరిగే అవకాశముందని చెప్పారు.

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్, ఒకటో సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఎమ్మెల్యే విష్ణు గురువారం నిర్వహించారు. ప్రశాంత్ కాలనీలో విస్తృతంగా పర్యటించి 153 గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోక వెనుకబడి పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక గడిచిన నాలుగేళ్లలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. గుణదల ఆర్వోబీని సైతం వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని తెలిపారు. కొందరు కోర్టులలో వేసిన కేసుల కారణంగా పనులు కొంత ఆలస్యమయ్యాయని వెల్లడించారు. త్వరలో స్టేజ్–2 పనులకు టెండర్లు పిలుస్తామన్నారు. ఇప్పటికే రూ.12.50 కోట్లతో భూమిని సేకరించినట్లు చెప్పారు. గతిశక్తి ప్రాజెక్ట్ కింద ఈ ప్రాంతంలో మరో రెండు వంతెనలు మంజూరైనట్లు వివరించారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఉలవచారు కంపెనీ ప్రాంతం నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డుతో పాటు దావు బుచ్చయ్య కాలనీ వైపు రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక విప్లవానికి కేరాఫ్ అడ్రస్....

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో సామాజిక విప్లవానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మల్లాది విష్ణు అన్నారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందన్నారు. ఆయా వర్గాలు సామాజికంగా ముందుకు వెళ్లడమే కాకుండా రాజకీయ, ఆర్థిక రంగాల్లోనూ ముందజలో ఉన్నట్లు తెలిపారు. ఒక్క పైసా అవినీతికి తావివ్వకుండా కోట్లాది రూపాయలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లబ్ధి కలిగిందని చెప్పారు. విప్లవాత్మక సంస్కరణలతో సీఎం జగన్ అందిస్తున్న ఈ సుపరిపాలనను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. సామాజిక సాధికారతతో వైఎస్సార్ సీపీ నాయకులు బస్సు యాత్ర చేస్తుంటే జైల్లో ఉన్న వ్యక్తి కోసం టీడీపీ నాయకులు యాత్రలు చేయడం విడ్డూరమన్నారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత టీడీపీ చేపట్టిన కార్యక్రమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఎద్దేవా చేశారు. టీడీపీ–జనసేన కలయికతో కొత్తగా జరిగే అద్భుతాలు ఏమీ ఉండవన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దండి సురేష్, బండి వేణు, యలమంద, మండాది వెంకట్రావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బాణసంచా కాల్చి ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కనకదుర్గ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎళ్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. శ్రీదుర్గాదేవి అమ్మవారి నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం వద్ద చేపట్టిన శ్రీదేవీ శరన్నవరాత్రుల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నదానం నిర్వహించగా, రాత్రి చేపట్టిన అమ్మవారి ఊరేగింపు వైభవోపేతంగా జరిగింది. వీటికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ అమ్మవారి కృప, కరుణ, కాపుదల ప్రజలందరికి తోడుండాలని, అమ్మవారి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024లోనూ అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించాలని కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణి రెడ్డి, యక్కల మారుతీ, బంకా బాబి, కొలంటి రవి, మనోహర్, చక్రి, యక్కల మల్లి, శోభన్ చక్రాల, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా కార్పొరేషన్ స్కూల్స్



పాఠశాల ఆవరణలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా అన్నారు. సింగ్ నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతులు భవన నిర్మాణం పనులను కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలసి గురువారం ఆమె పరిశీలించారు. పనులకు సంబంధించిన వివరాలు ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, డోర్ లు, కిటికీలు, విద్యుత్ పనులు పెండింగ్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, భవనాన్ని త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం పాఠశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు ఎక్కువుగా పెరిగి ఉండడాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందన బాబును పిలిపించి పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం పథకం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎంలు పి.వెంకటేశ్వర్లు, ఇమామ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షిరిడీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, కుంచనపల్లి రవిశంకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం దాత కుంచనపల్లి రవిశంకర్ దంపతులచే భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు షిర్డీసాయిబాబా మందిరంలో భక్తులు, దాతల మనోభావాలకు అనుగుణంగా సేవలు అందజేస్తున్నామన్నారు. షిరిడీ వెళ్లి మొక్కులు చెల్లించుకోలేని వారు సైతం ఇక్కడకు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



దేవిడ్‌రాజును గాన సామ్రాట్ బిరుదుతో సత్కరిస్తున్న కారుమంచి రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు అన్నారు. విశ్వకవి సామ్రాట్ జాషువా కళాపీఠం, ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, గాయకుడు డేవిడ్‌రాజుకు గాన సామ్రాట్ బిరుదు ప్రదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని తెలిపారు. పురస్కార ప్రదాత డేవిడ్‌రాజు గురించి మాట్లాడుతూ పోలీస్ అధికారిగా విశేషమైన సేవలను అందించారని పేర్కొన్నారు. అంబేద్కర్ సాంస్కృతిక సంస్థ ద్వారా అనేక మంది నూతన గాయనీ గాయకులను పరిచయం చేశారని చెప్పారు. నిర్వాహకుడు డేవిడ్‌రాజును గాన సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ సునీల్‌కుమార్, కొప్పుల ఆనంద్, బీవీ వీరభద్రరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పి.శ్రీనివాస్, మారేపల్లి జోషి, కె.రత్నకుమారి, పావని, సిరిమోక్ష పాల్గొన్నారు. గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంతో మహిమాన్వితమైన శివకామేశ్వరీ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేసి అన్నప్రసాద వితరణను అవ్వా హేమసుంద వరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అంగరంగ వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మహా సంస్థానమ్ సేవలను కొనియాడారు. అనంతరం సుమారు ఐదు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, వేణుగోపాల్, గవాస్కర్, పేరం త్రివేణి రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మార్పిడి' యూనివర్సిటీ విద్యార్థులకు వరం



మాట్లాడుతున్న మహ్మద్ ఇంతియాజ్

గుణదల(విజయవాడ తూర్పు): విదేశాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు రూపొందించిన ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం యూనివర్సిటీల విద్యార్థులకు ఉపయోగపడుతుందని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. ఆంధ్ర లయోల కాలేజీలో గురువారం స్టూడెండ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ భిన్నమైన వాతావరణ పరిస్థితుల నడుమ విభిన్న సంస్కృతులను అధ్యయనం చేయడానికి స్టూడెంట్ మార్పిడి ప్రోగ్రాంను రూపొందించారన్నారు. కొత్త వ్యక్తులను కలవడం, వారి సంస్కృతి, సంప్రదాయాలను అవగతం చేసుకునేందుకు విద్యార్థులకు దోహదం పడుతుందని తెలిపారు. ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విద్యార్థి మార్పిడి కార్యక్రమం నైపుణ్యాల పెంపునకు దోహదపడుతుందన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ బాలస్వామి, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ సీహెచ్ రాజేంద్రబాబు, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్యూట్ టి లింపోబ్లాస్టిక్ లుకేమియాకు విజయవంతంగా చికిత్స



అక్యూట్ టి లింపోబ్లాస్టిక్ లుకేమియా నుంచి కోలుకున్న చిన్నారితో వైద్య బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోషకాహార లోపం ఉన్న చిన్నారిలో పిడియాట్రిక్ అక్యూట్ టి-లింఫోబ్లాస్టిక్ లుకేమియాను గుర్తించి విజయవంతంగా చికిత్స చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాంప్రహ్లాద్ కె.ఎం తెలిపారు. మీడియాకు గురువారం తెలిపిన వివరాల ప్రకారం తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి బరువు తక్కువగా ఉంది. సాధారణంగా ఆ వయస్సులో 16–20 కేజీలు ఉండాల్సి ఉండగా, కేవలం 9 కేజీలు మాత్రమే ఉంది. క్యాకెక్సియా తీవ్రత కారణంగా చికిత్సకు కూడా నిరాకరించే అసాధరణమైన కేసుగా తీసుకుని, చికిత్స చేయడం సవాల్‌గా భావించినట్లు డాక్టర్ రాంప్రహ్లాద్ తెలిపారు. ప్రొటీన్ సప్లిమెంట్‌తో డైట్‌ను సంవృద్ధి చేయడం, బరువుకు తగినట్లుగా ఔషధ మోతాదు సర్దుబాటుతో కిమోను ప్రారంభించినట్లు తెలిపారు. కీమోథెరపీ సమయంలో పలు రకాల ఇన్‌ఫెక్షన్‌లకు గురైనట్లు తెలిపారు. ఈ కేసు అత్యవసర స్థితిని గుర్తించి సమగ్ర వైద్య విధానంతో సరైన మోతాదులో కీమో ఇవ్వడంతో కోలుకున్నట్లు తెలిపారు. తమకు ఇదొక అద్భుతమైన చికిత్సగా ఆస్పత్రి రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి తెలిపారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన ఎంఎస్ఎంఈ సౌజన్యంతో 'పారిశ్రామికరంగం - అవకాశాలు' అంశంపై సదస్సును గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన భాస్కరరావు మాట్లాడుతూ యువతకు అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవడానికి తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. నేడు ఉత్పత్తి, సేవా రంగాల్లో విస్తృతమైన ఆలోచనలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆలోచనలకు పదును పెడితే అద్భుతమైన విజయాలను అందుకుంటారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఓబీసీ జనరల్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ పారిశ్రామికరంగం దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన అనేక అవకాశాలు, సదుపాయాలను కల్పిస్తున్నాయన్నారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఎదురు చూస్తుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఇనోవేటివ్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్, స్పెస్ ఇన్ఫో టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ శ్రీదేవి తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమాన్ని ఎంఎస్ఎంఈ (విశాఖపట్నం) డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్ సహాయ సంచాలకుడు జె.చంద్రమౌళి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.







భజే భవానీ..

ఇంద్రకీలాద్రి పరిసరాలు భవానీ నామస్మరణతో మార్మోగాయి. ఇతర ప్రాంతాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో దుర్గగుడి ఘాట్ రోడ్డు ఆధ్యాత్మిక తరంగాలుగా కనిపించింది. విదేశాల నుంచి వచ్చిన భక్తులు కనకదుర్గమ్మను కనులారా దర్శించుకున్నారు. అన్నదాన ప్రాంగణం, ప్రసాదాల కౌంటర్ల వద్ద భవానీలతో కిక్కిరిసింది. జగన్మాతను స్మరించుకుంటూ భక్తజనం పెనుదిరిగారు. –సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ



